క్లుప్తంగా

నారుమడుల్లో పొడతెగులు



రోలుగుంటలో రైతు నారుమడిలో ఆశించిన పొడతెగులు

రోలుగుంట : నారుమడులను ఆశిస్తున్న తెగులు పట్ల రైతులు పలు జాగ్రత్తలు పాటించాలని మండల వ్యవసాయాధికారి చిరంజీవి తెలిపారు. మండలంలో ఆయన మంగళవారం రోలుగుంట, కొవ్వూరు మరికొన్ని గ్రామాల్లో గల నారుమడులను సందర్శించారు. రోలుగుంటలో పలు చోట్ల రైతుల నారుమడుల్లో పొడతెగులు గుర్తించారు. దీనిపై ఆయన 100 ఎ.ఎల్. హెక్సాకొనజోల్‌ను పిచికారి చేసి నియంత్రించుకోవాలన్నారు. ఖరీఫ్ వరి సాగుకు సంబంధించి ఆకు పోతల పనులు జరిగి ఇప్పటికి 15 నుంచి 20 రోజులు అయిందన్నారు. ప్రారంభంలో నారుమడుల్లో యూరియా వేయని రైతులు వరి సాగు ఎకరా విస్తీర్ణానికి నారుమడికి కేటాయించిన పది సెంట్ల నారుమడిల్లో కేజీ యూరియా, కేజీ డీఏపీ, రెండు కేజీలు పొటాష్ వినియోగించాలని సూచించారు. ఆశించిన పొడతెగులు మాత్రం రైతులు వెంటనే సూచించిన విధంగా హెక్సాకొనజోల్ వినియోగించి నియంత్రించుకోవాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు.

పాడి పశువులకు సబ్సిడీపై పశుదాణా పంపిణీ

చీడికాడ : మండలంలో జైతవరం గ్రామంలో మంగళవారం పాడి రైతులకు పశుదాణా పంపిణీ చేశారు. స్థానిక పశువైద్యశాఖ సహాయకులు మెర్తా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో 50 శాతం సబ్సిడీపై పంపిణీ చేసే ఈ పశుగ్రాస దాణా పూర్తి రేటు రూ.1150 కాగా, రూ.555కు విక్రయిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో కురచా నారాయణ మూర్తి, దోకల అక్కునాయుడు, కాశీ విశ్వనాథం, రెడ్డి రవి పాల్గొన్నారు.

పాఠశాల తనిఖీ చేసిన సర్పంచ్

రావికమతం : కొత్తకోటలో గల గుమ్మిడి వీధిలో గల ప్రాథమిక పాఠశాలను గ్రామ సర్పంచ్ కోన లోవరాజు,వైస్ సర్పంచ్ పందల దేవా మంగళవారం సందర్శించారు.పాఠశాలలో తరగతి గదులు, మధ్యాహ్న భోజన ఏర్పాట్లు పరిశీలించారు. మధ్యాహ్న భోజనం రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ప్రధానోపాధ్యాయుడితో మాట్లాడుతూ విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలని సూచించారు.

పాడి పశువుల పంపిణీకి లబ్ధిదారులను గుర్తించాలి



అధికారులు, సిబ్బందితో సమీక్ష నిర్వహిస్తున్న డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ శచీదేవి

రావికమతం: డ్వాక్రా సంఘాల్లోని మహిళలు స్వయం ఉపాధి సాధించేందుకు ఉన్నతి, స్త్రీనిధి కింద బ్యాంక్ లింకేజి ద్వారా పాడి పశువుల కొనుగోళ్లకు రుణాలు ఇప్పించి వారి ఆర్థికాభివృద్ధికి తోడ్పాటు అందించేలా ప్రణాళికలు తయారు చేయాలని డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ శచీదేవి చెప్పారు. మంగళవారం రావికమతం వెలుగు కార్యాలయంలో పింఛన్లు పంపిణీ, వెరిఫికేషన్, వెలుగు ద్వారా స్వయంఉపాధి రుణాలకు లబ్ధిదారుల ఎంపికపై సమీక్ష జరిపారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారంలో జర్నలిస్టుల పాత్ర కీలకం



సమావేశంలో పాల్గొన్న ఎంపీపీ జగన్‌మోహన్

కె.కోటపాడు : ప్రజా సమస్యల పరిష్కారంలో జర్నలిస్ట్‌ల పాత్ర ప్రముఖమని ఎంపీపీ రెడ్డి జగన్ మోహన్ అన్నారు. స్థానిక అయ్యన్న విద్యాసంస్థల ప్రాంగణంలో మంగళవారం చోడవరం ప్రెస్ క్లబ్ సమావేశంలో అతిథి పాల్గొన్న ఎంపీపీ మాట్లాడారు. మండలంలో ప్రెస్ క్లబ్ సభ్యులు చిన్నారుల చదువులతో పాటు అరోగ్యపరమైన సమస్యలకు ప్రత్యేకమైన నిధిని ఏర్పాటు చేసుకుంటే తన వంతుగా రూ.25వేలను ఇవ్వనున్నట్టు తెలిపారు. రాష్ట్ర ఏపీయూడబ్ల్యూజే ప్రధాన కార్యదర్శి స్వామి మాట్లాడుతూ జర్నలిస్టులు సంఘటితంగా సామాజిక సేవా కార్యక్రమాల్లో పాలు పంచుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ భుజంగరావు, ఎస్ఐలు ధనుంజయ్, లక్ష్మీనారాయణ, అయ్యన్న విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ ఎస్.కె.ఖాసిమ్, రాష్ట్ర కొప్పుల వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ మహేష్, ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు జోగినాయుడు తదితరులు పాల్గొన్నారు.

గొడౌను కట్టారు... రోడ్డు మరిచారు



సివిల్ సప్లయి భవనానికి వెళ్లే ప్రధాన రోడ్డు ఇదే



డి.యర్రవరంలో పౌర సరఫరాల గోదాము

నాతవరం : పౌరసరఫరాల గిడ్డంగికి నూతన భవనాలు నిర్మించి అక్కడకు వెళ్లేందుకు రోడ్డు వేయడం మరిచారు.' దీంతో పౌరసరఫరాల గొడౌనుకు వెళ్లే వారు అనేక బాధలు పడుతున్నారు. పౌరసరఫరాల వ్యవస్థ ఏర్పాటు అయిన దగ్గర్నుంచి నాతవరం గ్రామంలోనే అద్దే భవనంలో నిర్వహించేవారు. 2012లో అప్పటి ప్రభుత్వం జిల్లా వ్యాప్తంగా సివిల్ సప్లయి గొడౌనులకు సొంత భవనాలు నిర్మించేందుకు చర్యలు చేపట్టింది. అప్పట్లో నాతవరంలో సొంత భవనాలు నిర్మించేందుకు అవసరమైన స్థలాన్ని అధికారులు స్థానిక ప్రజాప్రతినిధులు సమకూర్చలేకపోయారు. గోడౌను నిర్మాణ పనులు యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని కలెక్టరు నుంచి తీవ్ర ఒత్తిడి రావడంతో అప్పటి నర్సీపట్నం ఆర్డీవో ప్రభాకర్ నాతవరం తహసీల్దార్ కన్నాపాత్రుడు చొరవతో డి.యర్రవరం పంచాయతీలో స్థలాన్ని కేటాయించారు. అక్కడ సివిల్ సప్లై గొడౌను భవన నిర్మాణ పనులు పూర్తి చేసి సరకులు తరలించారు. అక్కడి నుంచే ప్రతి నెలా మండల వ్యాప్తంగా గ్రామాలకు సరుకులు సరఫరా చేస్తున్నారు. ఈ గొడౌనుకు వెళ్లే దారి మట్టిరోడ్డు కావడంతో ఏమాత్రం వర్షం పడినా రోడ్డంతా బురదమయంగా తయారవుతుంది. నిత్యవసరుకులు తరలించే క్రమంలో ఆనేకసార్లు వాహనాలు ఈమట్టి రోడ్డులో కురుకుపోయిన సందర్భాలు అనేకం ఉన్నాయి. వాహనదారులు సివిల్ సప్లయి అధికారులు సొంత డబ్బులతో రోడ్డు మరమ్మతులు చేయించుకోని రాకపోకలు సాగిస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు ఈ రోడ్డంతా బురదమయంగా తయారై రాకపోకలు సాగించేందుకు ఇబ్బందిగా తయారైంది. లోడుతో వచ్చే లారీలు ఇక్కడకు రావాలంటే హడలెత్తిపోతున్నాయి. రోడ్డులో కురుకుపోతే పొక్లెయిన్ సాయంతో బయటకు లాగిన సంఘటనలు ఉండడంతో వర్షాకాలమంతా ఈ రోడ్డులో ప్రయాణం చేయలేమంటున్నారు. గతంలో నర్సీపట్నం సబ్ కలెక్టరుగా పని చేసిన మౌర్య ఆకస్మికంగా గొడౌను తనిఖీకి వచ్చినప్పుడు అధ్వానంగా తయారైన రోడ్డును చూసి వెంటనే రోడ్డు వేయాలంటూ సంబంధిత శాఖ అధికారులకు ఆదేశించారు. ఆమె ఆ తర్వాత బదిలీ కావడంతో ఈరోడ్డుపై కన్నెత్తి చూసే అధికారులు కరువయ్యారు.

వసతి గృహాలపై కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యం తగదు



కేజీబీవీలో విద్యార్థినులను సమస్యలపై ఆరా తీస్తున్న వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు హేమంత్‌కుమార్, జెడ్పీటీసీ కర్రి సత్యం, బూరె బాబూరావు

దేవరాపల్లి : వసతి గృహాలపై కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం తగదని, కనీస సదుపాయాలు లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు బొడ్డేపల్లి హేమంత్‌కుమార్ అన్నారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధ్యక్షుడు వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు మండలంలోని బేతపూడి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం, దేవరాపల్లి బీసీ బాలుర వసతి గృహాన్ని ఆయన మంగళవారం సందర్శించారు. స్థానిక వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూరె బాబురావు, స్థానిక జెడ్పీటీసీ కర్రి సత్యం తదితర నాయకులతో కలిసి వసతి గృహాలను పర్యవేక్షించారు. ముందుగా కేజీబీవీని సందర్శించి విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా లేదా అని ఆరా తీసి వంట గదిని, స్టోర్ రూమ్‌ను పరిశీలించారు. విద్యా బోధన ఎలా ఉందని, విద్యా సామగ్రి అందించారా లేదా అని ఇతర మౌలిక సదుపాయాలపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కేజీబీవీలో తరగతి గదుల సమస్య ఉన్నట్టుగా గుర్తించారు. దేవరాపల్లి బీసీ బాలుర వసతి గృహాన్ని పరిశీలించి శిథిలావస్థలో ఉన్న భవనంతో ప్రమాదం పొంచి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. మరుగుదొడ్లు సైతం అధ్వానంగా ఉన్నాయని అసంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు హేమంత్‌కుమార్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వసతి గృహాలన్నీ సమస్యల వలయంలో చిక్కుకున్నాయని, కనీస సదుపాయాలు లేక విద్యార్థులు నానా అవస్థలు పడుతున్నారన్నారు. సాక్షాత్తు హోంమంత్రి అనిత హాస్టళ్లను సందర్శించి అక్కడ భోజనం చేసి నాణ్యతపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేయడమే ఇందుకు నిదర్శనమన్నారు. కొన్ని చోట్ల నాణ్యమైన ఆహారం అందించక పోవడం, మరికొన్ని చోట్ల కలుషిత ఆహారం తిని విద్యార్థులు ఆస్పత్రుల పాలైన ఘటనలు చోటుచేసుకున్నాయన్నారు. వసతి గృహాల్లోని పేద విద్యార్థుల జీవితాలతో కూటమి ప్రభుత్వం చెలగాటం ఆడడం సరికాదని, ఇప్పటికైనా వసతి గృహాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కర్రి సత్యం, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వరదపురెడ్డి లలితానాయుడు, మండల అధ్యక్షుడు బూరె బాబురావు, జిల్లా విద్యార్థి విభాగం కార్యవర్గ సభ్యుడు కొరుపోలు శ్రీను, వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా మండల అధ్యక్షుడు గంగవంశం సంతోష్, ఎ. కొత్తపల్లి సర్పంచ్ చింతల సత్య వెంకటరమణ, సీనియర్ నాయకులు చల్లా మహేష్ పాల్గొన్నారు.

విద్యుత్ స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలి

చోడవరం : విద్యుత్ స్మార్ట్ మీటర్లను వినియోగదారులంతా వ్యతిరేకించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో ఇంటింట ప్రచారం నిర్వహించారు. వెంకన్నపాలెం గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రజలను చైతన్య పరిచారు. పారిశ్రామిక వ్యక్తుల చేతుల్లో ప్రజలను జీవితాలను నాశనం చేయాలన్న లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యుత్ స్మార్ట్ మీటర్లు ఏర్పాటును ప్రజలపై బలవంతంగా మోపుతున్నారని సీపీఎం జిల్లా ప్రతినిధి ఎ. శ్రీనివాసరావు ధ్వజమెత్తారు. గత ప్రభుత్వ హయాంలో స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించిన కూటమి పార్టీల నాయకులు ఇప్పుడు వారి ప్రభుత్వం వచ్చాక ప్రభుత్వ కార్యాలయాలకు, ప్రజల గృహాలకు విధిగా వేసుకోవాలని నిబంధనలు విధించడం వారి ద్వంద వైఖరికి అద్దం పడుతుందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారంలోకి వస్తే కరెంటు చార్జీలు పెంచబోమని పాదయాత్రలో లోకేష్ చెప్పి ఇప్పుడు ఏడాది తిరగకుండానే కరెంటు చార్జీలు భారీగా పెంచి ప్రజలను మోసం చేశారని శ్రీనివాసరావు అన్నారు.

ఆదాని స్మార్ట్ విద్యుత్ మీటర్లు బిగించడం వల్ల ప్రతి వినియోగదారుడి వివరాలన్నీ ఆదానీ చేతుల్లోకి వెళ్లిపోతాయన్నారు. అందుకే ఎవరూ స్మార్ట్ మీటర్లు బిగించుకోవద్దని కోరుతూ ప్రచార పోస్టర్లను అతికించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల నాయకుడు ఎస్.వి.నాయుడ పాల్గొన్నారు.

మండల సర్వసభ్య సమావేశం వాయిదా

బుచ్చెయ్యపేట : మండల సర్వ సభ్య సమావేశం వాయిదా పడింది. మంగళవారం జరగాల్సిన మండల సర్వ సభ్య సమావేశానికి అన్ని గ్రామాల ఎంపీటీసీలు, సర్పంచ్‌లు హాజరైనా అధికారులు రాకపోవడంతో సమావేశాన్ని ఈ నెలాఖరు 31వ తేదీకి వాయిదా వేస్తున్నట్లు ఎంపీడీవో భానోజీరావు ప్రకటించారు. జిల్లా కలెక్టర్ విజయక్రిష్ణన్ వడ్డాది పర్యటన సందర్భంగా మండల అధికారులంతా కలెక్టర్ నిర్వహించిన సమీక్షలో పాల్గొనడంతో మండల సమావేశం వాయిదా పడింది.

టీడీపీ మండల అధ్యక్షునిగా మహేష్



కె.కోటపాడు : కె.కోటపాడు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షునిగా రొంగలి మహేష్ నియమితులయ్యారు. ఇది వరకూ మండల పార్టీ అధ్యక్షునిగా కొనసాగుతున్న మహేష్‌ను రెండో పర్యాయం కూడా ఎంపిక చేశారు. ఆయనతో పాటు మండల టీడీపీ ప్రధాన కార్యదర్శిగా జూరెడ్డి రాము, క్లస్టర్ ఇన్‌చార్జిలుగా కన్నూరి సూరిబాబు, వెలగల పైడంనాయుడును నియమించారు. ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తితో పాటు మండల గ్రామాల్లో గల పార్టీ నాయకులకు మండల తెలుగుదేశం అధ్యక్షునిగా నియమితులైన మహేష్ కృతజ్ఞతలు తెలిపారు.

పులుల సంరక్షణపై విద్యార్థులకు అవగాహన



పులుల మాస్కులు ధరించిన విద్యార్థులు

నర్సీపట్నం : మాకవరపాలెం మండలం, తూటిపాల ప్రాథమికోన్నత పాఠశాలలో మంగళవారం జాతీయ పులుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు కె.రాము విద్యార్థులందరితో పులుల మాస్కులు ధరింపజేశారు. అంతరించిపోతున్న పులులను రక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఉపాధ్యాయులు రాము విద్యార్థులకు సూచించారు. జీవవైవిధ్యం దెబ్బతినకుండా ఉండాలంటే పెద్ద పులులు చాలా అవసరమన్నారు. ఈ అవశ్యకతను గుర్తించే మన ప్రభుత్వాలు పులుల కోసం ప్రత్యేకంగా టైగర్ కారిడార్లను ఏర్పాటు చేశారన్నారు. పులుల సంరక్షణకు ఎన్నో నేషనల్ పార్కులు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు లోవరాజు పాల్గొన్నారు.

పామాయిల్ సాగుపై దృష్టి సారించాలి

దేవరాపల్లి : తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం సమకూరే పామాయిల్ సాగుపై రైతులు దృష్టి సారించాలని స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి అన్నారు. దేవరాపల్లిలోని రైవాడ అతిథి గృహ ఆవరణలో మంగళవారం ఆయిల్ పామ్ తోటల విస్తరణ మహోత్సవాన్ని పురస్కరించుకొని రైతులతో అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీలను సద్వినియోగం చేసుకొని లాభసాటిగా ఉన్న ఆయిల్ పామ్ సాగుపై దృష్టి పెట్టాలన్నారు. పామాయిల్‌కు మద్దతు ధర సైతం ఆశాజనకంగా ఉందని, వీటిలో అంతర పంటలు సైతం సాగు చేసుకోవచ్చునని వివరించారు. పామాయిల్ సాగుతో అధిక ఆదాయం పొందుతున్న రైతులను సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా ఏపీఎంఐపీ పీడీ జి.వి.లక్ష్మి, స్థానిక ఉద్యానవన అధికారి కిరణ్మయి, జిల్లా ఆయిల్‌పామ్ రైతుల సంఘం అధ్యక్షుడు పి.సీతారామరాజు, పైలా ప్రసాదరావు, కిలపర్తి భాస్కరరావు, పెద్దాడ వెంకటరమణ తదితర ఆయిల్ పామ్ రైతులు పాల్గొన్నారు.

దొండపూడిలో రీ సర్వే పూర్తి

రావికమతం : మండలంలో దొండపూడి గ్రామంలో ప్రభుత్వం చేపట్టిన భూమి రీ సర్వే పూర్తయిందని రావికమతం మండల తహసీల్దార్ అంబేడ్కర్ తెలిపారు. దీనిపై దొండపూడి సచివాలయ వద్ద రైతులతో మంగళవారం సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో తహసీల్దార్ అంబేడ్కర్ మాట్లాడుతూ గ్రామంలో నిర్వహించిన రీ సర్వే విజయవంతమైందని, రీ సర్వేలో పూర్తయిన రైతుల ఖాతా నంబర్ పేర్లు సభల్లో చదివి వినిపించారు.'రీ సర్వేకు సహకరించిన రైతులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ శ్రీనివాస్, వీఆర్వో మూర్తి, మాజీ సర్పంచ్ తాత బాబు, మాజీ వైస్ సర్పంచ్ ఆచారి, కళ్యాణపులోవ రిజర్వాయర్ చైర్మన్ బంటు రాముునాయుడు, మాజీ రిజర్వాయర్ చైర్మన్ అబ్బాయిరమణ, నాయకులు రామునాయుడు పాల్గొన్నారు.

'ఆశ'లపై రాజకీయ వేధింపులు ఆపాలి



ఆశ వర్కర్ల సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు నాయకులు చిరంజీవి

నర్సీపట్నం : ఆశవర్కలపై రాజకీయ వేధింపులు ఆపాలని సీఐటీయూ నాయకులు ఈరెల్లి చిరంజీవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మాకవరపాలెం మండలం ఆశ వర్కర్ల మండల కమిటీ సమావేశం మంగళవారం జరిగింది. ఆశలను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పును అనుసరించి సమాన పనికి సమాన వేతనంలో భాగంగా రూ.26 వేలు ఇవ్వాలన్నారు. ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఆశ వర్కర్లకు కూడా వర్తింపజేయాలన్నారు. బీమా సౌకర్యం కల్పించాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వల్లి వరలక్ష్మి, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

పాత పద్ధతిలోనే దమ్ములు

మాడుగుల : గత 20 ఏళ్ల క్రితం గ్రామీణ ప్రాంతంలో రైతులందరూ కాడెడ్లుతో దుక్కులతో పాటు దమ్ములు చేసేవారు. ఆ తర్వాత రైతులందరూ యంత్రాలపై ఆధారపడేవారు. మండలంలో వొమ్మలి, జేడీపేట, ఎం. కోడూరు, శంకరం, తాటిపర్తి, తదితర గ్రామాల్లో 50 శాతం మంది రైతులు పశువులతో దమ్ములు చేస్తున్నారు. ఇలా దమ్ము చేయడం వల్ల దిగుబడులు బాగా వస్తాయని, రైతులు చెబుతున్నారు. ప్రస్తుతం వర్షాలు అనుకున్నంత లేకపోవడంతో వ్యవసాయ మోటారులతో దమ్ములు చేస్తున్నారు.

నారుమడికి నీటి తడులు ఇవ్వాలి



మాట్లాడుతున్న ఏడీఆర్ డాక్టర్ ముకుందరావు

అనకాపల్లి: ఉష్ణోగ్రతలు పెరుగుతున్నందున నారుమడి బెట్టకు గురికాకుండా నేలలో పదును చూసుకుని నీటి తడులు ఇవ్వాలని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఏడీఆర్ డాక్టర్ సీహెచ్.ముకుందరావు తెలిపారు. మంగళవారం స్థానిక ఆర్ఏఆర్ఎస్ కార్యాలయంలో శాస్త్రవేత్తలతో సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన పలు సూచనలు, సలహాలు అందించారు. బెట్ట పరిస్థితులలో ఒక గ్రాము మల్టి కె లేదా 19:19:19ను లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. నారుమడిలో ఇనుము ధాతులోప సవరణకు 5 గ్రాముల అన్నభేది, 0.5 గ్రాముల నిమ్మ ఉప్పు లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారీ చేయాలి. వరి నారుమడిలో పొడతెగులు ఆశించే అవకాశముంది. హెక్సాకొనజోల్ 2.0 మీ.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేసి నివారించవచ్చు. వరి నారు తీయడానికి 7 రోజుల ముందు సెంటు నారుమడికి 160 గ్రాముల ల కార్బోఫ్యూరాన్ గుళికలు ఇసుకలో కలిపి పలుచగా నీరు ఉంచి వేయాలి. నారుమడి నాటుకోవడానికి సిద్ధంగా ఉన్నట్లయితే, పూత దశలో పచ్చిరొట్ట పైరును నేలలో కలియదున్నుకుని పొలాన్ని తయారు చేసుకోవాలి. ఆఖరి దమ్ములో ఎకారాకు 35 కిలోల యూరియా, 150 కిలోల సింగిల్ సూపర్ ఫాస్పెట్, 17 కిలోల మురేట్ ఆఫ్ పోటాష్ వేసుకోవాలి. ఎకరాకు 20 కిలోల జింక్ సల్ఫేట్ వేసుకోవాలి. జింక్ సల్ఫేట్ వేసినప్పుడు భాస్వరం ఎరువులతో కలపకుండా కనీసం మూడు రోజుల వ్యవధి ఉండేలా చూసుకోవాలి. వరి నాటేటప్పుడు ఆకు చివర్లను తుంచి 20 ఇన్ టూ 15 సెం.మీ దూరంలో కుదురుకు 2-3 మొక్కల చొప్పున నాటుకోవాలి. ఖరీఫ్‌లో చ.మీ.కు 33 మొనలు ఉండేలా చూసుకోవాలి. నాటిన తర్వాత ప్రతి రెండు మీటర్లకు 20 సెం.మీ. బాటలు తియ్యడం వల్ల పైరుకు గాలి, వెలుతురు బాగా సోకి చీడపీడల ఉధృతి కొంత వరకూ అదుపు చేయవచ్చు. పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, తగిన వర్ష సూచన లేనందున నేలలో పదును చూసుకుని వెద వరికి నీటి సదుపాయం కల్పించాలి. చెరకులో మొజాయిక్ తెగులు ఆశించే పేను బంక పురుగుల ద్వారా వ్యాప్తి చెందే అవకాశం ఉన్నందున నివారణకు డైమిథోయేట్ 2 మి.లీ లేదా మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ. 5 గ్రాముల మల్టికెను లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. ఎకరానికి 35 కిలోల మ్యురేట్ ఆఫ్ పొటాష్‌ను వేసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ప్రధాన శాస్త్రవేత్తలు కె.వి.రమణమూర్తి, డి.ఆదిలక్ష్మి, వి.గౌరీ, సిహెచ్.ఎస్.రామలక్ష్మి, ఎ.అలివేణి తదితరులు పాల్గొన్నారు.

బాలల హక్కుల పరిరక్షణకు కమిటీల కృషి

జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ సాధికారిత అధికారి సూర్యలక్ష్మి



మాట్లాడుతున్న జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ సాధికారిత అధికారి సూర్యలక్ష్మి

కశింకోట: బాలల హక్కుల పరిరక్షణకు, వారిని బాధ్యతాయుతమైన భావి భారత పౌరులుగా తీర్చిదిద్దడానికి గ్రామస్థాయి బాలల సంక్షేమ రక్షణ కమిటీలు బాధ్యతగా కృషి చేయాలని జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ సాధికారిత అధికారి ఎస్. సూర్యలక్ష్మి కోరారు. మంగళవారం కశింకోట పంచాయతీ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఐసీడీఎస్ ప్రాజెక్టు తరపున అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామ స్థాయిలో పిల్లల హక్కుల కోసం, చట్టాలు అమలు, వారిని బాధ్యులుగా తయారు చేయడానికి 11 మందితో బాలల రక్షణ సంక్షేమ కమిటీని ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ కమిటీ బాల బాలికలకు సమస్యలు లేని గ్రామంగా తీర్చిదిద్దాలన్నారు. బాల్య వివాహాలు లేకుండా చూడటం, బాల కార్మికులు, బాలల అక్రమ రవాణా, బాలలపై లైంగిక వేధింపులు, బడి బయట పిల్లలను గుర్తించడం, బాలలతో భిక్షాటన నివారించడం, వీధి బాలలను గుర్తించడం, బాలలు మత్తుకు బానిస కాకుండా చూడటం, పిల్లలను సెల్‌ఫోన్లకు దూరంగా ఉంచడం వంటి సమస్యలను లేకుండా కమిటీ చూడాలన్నారు. ఐసీడీఎస్ సీడీపీవో పి. ప్రభావతి మాట్లాడుతూ పుట్టిన బిడ్డను మురుగు కాలువలో పారవేయడంతో మృతి చెందిన సంఘటనలు పునరావృతం కాకుండా పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. చిన్నతనంలో గర్భధారణను అరికట్టాలన్నారు. జిల్లా బాలల రక్షణ అధికారి కె.ఎల్. మనోహరరావు పిల్లల దత్తత తీసుకునే విధానం గురించి వివరించారు. సర్పంచ్ మంత్రి జయరజని, వైస్ ఎంపీపీ పెంటకోట జ్యోతి, ఏఎస్ఐ కె. రమణమ్మ, ఉపాధ్యాయుడు ఎన్. రమణ, ఐసీడీఎస్ సూపర్ వైజర్ ఝాన్సీ, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు, బాలల రక్షణ విభాగం ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆకతాయిలకు అడ్డుకట్ట వేయాలని వినతి



పట్టణ ఎస్ఐ ఈశ్వరరావుకు వినతి పత్రం అందిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

అనకాపల్లి: పట్టణానికి గ్రామీణ ప్రాంతాల నుంచి రాకపోకలు సాగిస్తున్న విద్యార్థినులపై ఆకతాయిల వేధింపులు ఎక్కువగా ఉన్నాయని, విద్యా సంస్థలు వద్ద ఉదయం, సాయంత్రం సమయంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని ప్రజా సంఘాల ఐక్య వేదిక జిల్లా అధ్యక్షుడు బొట్టా చిన్నియాదవ్ కోరారు. స్థానిక పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ డి.ఈశ్వరరావుకు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ విద్యా సంస్థలు, ఎన్టీఆర్ క్రీడా మైదానం వద్ద ఆకతాయిలు అసభ్యకరమైన మాటలతో అమ్మాయిలను వేధిస్తున్నారన్నారు. ఎన్టీఆర్ క్రీడా మైదానంలో ఉదయం, సాయంత్రం సమయంలో విద్యార్థులు గ్రూపులుగా ఏర్పడి అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తున్నారన్నారు. రాత్రిళ్లు మందుబాబులకు ఎంతగానో ఉపయోగపడుతుందని తదితర డిమాండ్లతో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు బొడ్డేడ అప్పారావు, ఆళ్ల ప్రవీణ్ కుమార్, కొల్లి చిన్న అప్పారావు, బొబ్బిలి గోవిందరాజులు తదితరులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలి

అనకాపల్లి: కూటమి ప్రభుత్వం 2023-24 విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే చెల్లించాలని ఉత్తరాంధ్ర చర్చా వేదిక పట్టణ ప్రతినిధి బుద్ద రాజేష్ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. కూటమి అధికారం చేపట్టి 14 నెలలు కావస్తున్నా నేటికీ బకాయిలను రిలీజ్ చేయలేదన్నారు. మే నెలలో సచివాలయ ఉద్యోగులు విద్యార్థులతోపాటు వారి తల్లిదండ్రుల ఈకేవైసీ చేశారన్నారు. బకాయిలు తల్లిదండ్రులు అకౌంట్లో గాని కాలేజీ యాజమాన్యం అకౌంట్లో గాని పడలేదన్నారు.